సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 19-6-2025
సంపుటి: 21 సంచిక: 74
పేజీలు: 8 వెల: రూ.1



## పీసీసీ అధ్యక్షురాలు వస్తున్నారా..?
# మాకు తెలీదే!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల గురువారం సాయంత్రం శ్రీకాకుళం వస్తున్నారు. విచిత్రమేమిటంటే.. ఈ విషయం ఆ పార్టీలో ఉన్న జిల్లా నేతలెవరికీ తెలియదు. బుధవారం విశాఖ పట్నంలో పర్యటించిన వైఎస్ షర్మిల గురువారం ఉదయం విజయ నగరంలో ఉన్నారు. సాయంత్రం - మిగతా చివరి పేజీలో



## పాతవారు పోయె..
# కొత్త డాన్ వచ్చె...!



- ఎస్పీ ట్రీట్మెంట్‌కు అన్నీ మూసుకున్న నిర్వాహకులు
- కొత్త దుకాణాలు తెరిచిన చంద్ర
- ఒడిశాలో మూడు పేకాట కేంద్రాలు
- జిల్లా నుంచి వెళ్తున్న పేకాట బాబులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఉన్నత చదువులు అభ్యసించినవారికి ఉద్యోగాలు దొరకడంలేదు. ఇంతకు క్రితమే ఉద్యోగాలు సంపాదించుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాస్ట్ కటింగ్ పేరుతో పింక్ స్లిప్‌తో బయటకు వచ్చేస్తున్నారు. కానీ ఏ చదువూ లేని పోరంబోకులు మాత్రం జిల్లాలో అరాచకాలు చేస్తూ దండిగా సొమ్ములు సంపాదిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో రూ.30 వడ్డీకి రౌడీ బ్యాచ్ అంతా తిప్పుతోంది. బెట్టింగులు ఆడేవారు, పేకాట శిబిరాలకు వెళ్లేవారే వీరి కస్టమర్లు. గంజాయి తాగడానికి అలవాటుపడి, దాని మీద మందు కొట్టి ఎంత అప్పు చేస్తున్నాం, ఎంత పేకాటలో ఓడిపోతున్నామని గ్రహించలేని అభాగ్యుల వల్లే జిల్లాలో కొత్త క్యాంపస్‌లు వెలుస్తున్నాయి. ఇవేవో ఇంజినీరింగ్ కాలేజీలో, లేదూ అంటే సాఫ్ట్‌వేర్ సంస్థలో కావు. పేకాట శిబిరాలు. ఆడేవారు మీద పోలీసు దాడులు లేకుండా - మిగతా చివరి పేజీలో

## విద్యుత్‌శాఖ అధికారుల
# మాయాజాలం

## ఆధార్ ఒకటే..
# 50 కనెక్షన్లట!

- ఇతరుల సర్వీసులు ఒకే పేరుతో అనుసంధానం
- అధికారుల తప్పిదానికి బలైన ఆటోడ్రైవర్ కుటుంబం
- తల్లి వందనానికి అనర్హులంటూ వారి పిల్లలపై వేటు






(సత్యం న్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల మండలం కొత్తపేట పంచాయతీ గాడుపేటకు చెందిన ఆటోడ్రైవర్ బుగత గోవిందరావుకు ఇద్దరు పిల్లలు యశ్వంత్, విమల. కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వీరిలో ఒకరికి వైకాపా హయాంలో అమలు చేసిన అమ్మఒడి పథకం కింద ఆర్థిక సాయం అందింది. కానీ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన తల్లికి వందనం పథకానికి మాత్రం గోవిందరావు కుటుంబంపై అనర్హత వేటు పడింది. తమను ఎందుకు అనర్హులుగా పరిగణించారని సచివాలయంలో ఆరా తీస్తే.. 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నందున తల్లికి వందనం అందలేని సిబ్బంది సెలవిచ్చారు. గోవిందరావు కుటుంబం ఏ నెలా 140 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించడం లేదు. నెలనెలా వచ్చే విద్యుత్ బిల్లులు తీసుకుని సచివాలయానికి వెళ్లి ఇదే విషయాన్ని ఆయన మొరపెట్టుకున్నా.. తాము ఏమీ చేయలేమని సిబ్బంది చేతులెత్తేశారు. దీంతో గోవిందరావు పూర్తి సమాచారం కోసం విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించగా అక్కడి సిబ్బంది గోవిందరావుకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. అదేంటంటే.. బుగత గోవిందరావు ఆధార్ నెంబర్‌తో ఏకంగా 50 విద్యుత్ మీటర్లు తీసుకున్నట్టు రికార్డుల్లో ఉందన్న సమాచారాన్ని అతని చేతిలో పెట్టారు. దీంతో ఆయన లబోదిబోమంటూ విద్యుత్ అధికారులను కలిసి ఫిర్యాదు చేయగా చేసిన తప్పును కప్పిపుచ్చుకోడానికి 299 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించలేదంటూ ఒక ధ్రువీకరణ పత్రం చేతిలో పెట్టి బాధితుడిని పంపేశారు. తప్పు ఎక్కడ జరిగింది? ఎవరు చేశారు? అన్నది తేల్చకుండా తమ శాఖ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

### పేరు ఒకటే.. నెంబర్లు వేరు

ఇంకో విశేషం ఏమిటంటే.. బుగత గోవిందరావు ఎచ్చెర్ల మండలవాసి కాగా, ఎచ్చెర్ల, లావేరు, పొందూరు, రణస్థలం, జి.సిగడాం మండలాలకు చెందిన పలు గృహ విద్యుత్ సర్వీస్ నెంబర్లను గోవిందరావుకు చెందిన ఆధార్‌కు లింక్ చేసేశారు. అదీ ఒకటీ రెండు కాదు.. పొందూరులో 31, రణస్థలంలో 6, లావేరులో 6, ఎచ్చెర్లలో 4 సర్వీసులకు గోవిందరావు ఆధార్‌తో అనుసంధానం చేసేసి - మిగతా చివరి పేజీలో






• ఎడిటోరియల్

## నరక 'యోగ'ంలో రికార్డు సాధిస్తారా?

రెండు నెలల విరామం తర్వాత ఈమధ్యే సముద్రంలో చేపల వేట మొదలైంది. కానీ ఇంతలోనే మళ్లీ వేట నిషేధ ప్రకటన. మత్స్యకారులెవరూ చేపలవేటకు సముద్రంలోకి వెళ్లరాదని అధికారుల హెచ్చరికలు. ఈ ప్రకటనలు చూసి వాయుగుండమో, తుపాను వాతావరణం అలముకుందేనన్న అనుమానాలు కలగవచ్చు. కానీ అటువంటివేవీ లేవు. కానీ ఈ నెల 20,21 తేదీల్లో విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు చేపలవేటను నిషేధిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేనా ఆ రెండు రోజులూ విద్యాసంస్థలకు సెలవు. గత నెల రోజులుగా ఉత్తరాంధ్రలోనే కిందిస్థాయి నుంచీ పైస్థాయి వరకు ఏ శాఖ అధికారిని కదిలించినా అందరిదీ ఒకటే మాట.. ఒకటే బిజీ. ఇక విశాఖ నగరంలో అయితే విపరీతమైన ట్రాఫిక్ ఆంక్షలు. పర్యాటకులకు స్వర్గధామంగా భాసిల్లుతున్న బీచ్‌రోడ్డు దాదాపు మూసివేత. ఇవన్నీ ఎందుకంటే.. అధికారుల నుంచి వస్తున్న సమాధానం.. యోగాంధ్ర. అవును అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో యోగా విన్యాసాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఉత్సవాలకు దేశప్రధాని నరేంద్ర మోదీని సైతం రప్పిస్తోంది. సుమారు ఐదు లక్షల మంది ప్రజలను ఈ మహాక్రతువులో భాగస్వాములను చేయడం ద్వారా భారతీయ సనాతన విద్య అయిన యోగాను విశ్వవిఖ్యాతం చేయడం, గిన్నిస్ బుక్ సహా పలు అంతర్జాతీయ రికార్డులు సాధించడం, ప్రజా బాహుళ్యాన్ని యోగా వైపు మళ్లించి ఆరోగ్య సమాజాన్ని నిర్మించడం లక్ష్యంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. అంతే బాగానే ఉంది. కానీ యోగాంధ్ర పేరుతో గత కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం పాలనను పక్కన పెట్టేసి యోగాంధ్ర విన్యాసాలే చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ కార్యాలయానికి పనులపై వెళ్లినా యోగాంధ్ర తర్వాత రండి.. అన్న సూచనే వినిపిస్తోంది. కిందిస్థాయి గ్రామ, వార్డు సచివాలయాల నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు అందరూ ఈ కార్యక్రమాల బిజీతో సతమతమవుతున్నారు. ఇవన్నీ ఒకెత్తు, అయితే 21న అంటే శనివారం విశాఖ బీచ్ రోడ్డులో జరిగే యోగా కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఐదు లక్షల మంది ప్రజలను తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి 40 వేలు చొప్పున, అనకాపల్లి జిల్లా నుంచి లక్ష మందిని, పార్వతీపురం, అల్లూరి మన్యం జిల్లాల నుంచి 25 వేల మంది గిరిజన విద్యార్థులను, మిగతా జనాన్ని విశాఖ జిల్లా నుంచి తరలించాలని ఆయా జిల్లాల అధికారులకు లక్ష్యాలు నిర్దేశించారు. వీరందరినీ 20వ తేదీ(శుక్రవారం) సాయంత్రానికే ఆయా జిల్లాల నుంచి విశాఖ నగరానికి తరలించాలని నిర్ణయించారు. అలా చేస్తే గానీ శనివారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభమయ్యే యోగా కార్యక్రమంలో వారందరూ పాల్గొనలేరు. దాంతో షరా మామూలుగా జిల్లాల అధికారులు మహిళలు సభ్యులుగా ఉన్న డ్వాక్రా సంఘాలు, ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీలు, వైద్యశాఖ పరిధిలోని ఆశా కార్యకర్తల పైనే దృష్టి పెట్టారు. పదిమంది సభ్యులుండే ప్రతి డ్వాక్రా సంఘం నుంచి ఇద్దరు సభ్యులను తీసుకురావాలని లక్ష్యం విధిస్తూ మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు రిసోర్స్‌పర్సన్ల(ఆర్పీ) మెడపై కత్తిపెట్టారు. మామూలుగా పగటిపూట జరిగే కార్యక్రమాలకైతే జనసమీకరణ పెద్ద కష్టం కాదు. మహిళలు వెళ్లడానికి పెద్దగా అభ్యంతరాలు ఉండవు. కానీ ఇప్పుడు అలా కాదు. తెల్లవారు జామున జరిగే కార్యక్రమం కావడంతో తప్పనిసరిగా ముందురోజు రాత్రికే జనాలను విశాఖ నగరానికి తరలించక తప్పదు. ఈ అంశంగా అటు జనసమీకరణకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు, ఇటు మహిళా సంఘాల సభ్యులకు ఇబ్బందికరంగా మారింది. డ్వాక్రా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలందరూ మహిళలే. వారు ఒక రాత్రంతా ఇంటికి దూరంగా ఎక్కడో తెలియని ప్రాంతంలో ఉండటం, ఉంచాలనుకోవడం అభ్యంతరకరంగా చాలామంది భావిస్తున్నారు. వీరిలో పెళ్లికాని యువతుల విషయంలో ఒకరకమైన ఇబ్బందులున్నాయి. పెళ్లి అయ్యి పిల్లలున్న వివాహితలైతే పిల్లలు, సంసారాలను వదిలేసి రాత్రివేళ దూరంగా ఉండటం ఎంత ఇబ్బందికరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలాగే లక్షల సంఖ్యలో తరలించే మహిళలను విశాఖ నగరంలో రాత్రి వేళ ఆశ్రయం కల్పించడం, ఉదయం వారంతా కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం కూడా చిన్న విషయం కాదు. అది అధికారులకు కత్తి మీద సాములాంటిదే. ఏ చిన్న లోపం జరిగినా, అనుకోని అపశృతులు దొర్లినా అధికార యంత్రాంగంతోపాటు ప్రభుత్వం బద్నాం అవుతుంది. మరి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్లాన్ చేసిన ప్రభుత్వ పెద్దలు ఈ అంశాలను గుర్తించారో లేదో!

## యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష

(సత్యంన్యూస్, పొందూరు)

మండలంలోని ఎండీఓ ఆఫీస్‌లో ఎమ్మెల్యే & పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్‌తోపాటు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో గురువారం యోగాంధ్రపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న విశాఖలో జరిగే యోగాంధ్రాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖలు మండల అధికారులు, కూటమి ముఖ్య నాయకులు చిగిలిపల్లి రామ్మోహన్, కిల్లి నాగేశ్వరావు, బలగ శంకర్ భాస్కర్, అన్నెపు రాము, అనకాపల్లి రంగనాయకులు, బాడాన శేషగిరి, మండల పరిధిలోని ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.



## బీఎస్సీ నర్సింగ్ దరఖాస్తు గడువు పెంపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాల దరఖాస్తు గడువును ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వారు పెంచారని బొల్లినేని మెడస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది నుంచి నూతనంగా నిర్వహిస్తున్న ఈ ప్రవేశ పరీక్షకు ఇంటర్ బైపీసీ/ బ్రిడ్జి కోర్సుతో ఒకేషనల్ గ్రూపు పాసైనవారు అర్హులని తెలిపారు. ఈనెల 23 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం గలదన్నారు. జూలై6న కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. నర్సింగ్ చేయాలనుకునే విద్యార్థులు తప్పక దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు తమ కళాశాలల్లో డిప్లమో, బీఎస్సీ పారామెడికల్, బీపీటీ, ఎంఎల్‌టీ, జీఎన్ఎం కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు జెమ్స్ ప్రాంగణంలోని తమ కళాశాలను లేదా 7680945357, 9121999654 ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## మిగిలిన గురుకుల సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లాలోగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతిలో మిగిలిన సీట్ల అడ్మిషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకుల సమన్వయకర్త గ్రేస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 19 నుండి జిల్లాలోగల 8 పాఠశాలలో ఈ దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి/ విద్యార్థినులకు జిల్లావ్యాప్తంగా బాలురకు దుప్పలవలస, బాలికలకు ఎచ్చెర్లలో ఈనెల 25న ఉదయం 10గంటల నుండి 11గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాల విద్యార్థి/విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు. ఇతర వివరములకు 9701736862/ 9000314209 సమాచారం పొందాలని కోరారు.

## యోగా చైతన్యం ప్రపంచానికి చాటుదాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాంధ్రా కార్యక్రమం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని, ఈ స్ఫూర్తితో యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పే అరుదైన అవకాశం మనకు లభించిందని శ్రీకాకుళం ఎస్‌సీఈపీడీసీఎల్ నాగిరెడ్డి కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం 80అడుగుల రోడ్డులో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన యోగాంధ్రా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల ఆరోగ్యంపై ప్రభుత్వం పూర్తిస్థాయి దృష్టి సారిస్తోందన్నారు. చారిత్రక ప్రదేశాల్లో యోగాంధ్రా కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ఆయుష్ విభాగం, యోగా గురువులు, శిక్షకులు, సాధకుల సమన్వయంతో ప్రతి కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజులుగా శ్రీకాకుళం జిల్లాలో యోగాంధ్ర ఉత్సవాల్లా సాగుతోందని తెలిపారు. ఈనెల 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న అంతర్జాతీయ యోగా వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాపై విశేష ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తుచేశారు. యోగా మన శరీరం, మనసుపై నియంత్రణకు



మార్గదర్శక సాధనమన్నారు. ఒత్తిడిని జయించేందుకు ఇది ఉత్తమమైన మార్గమన్నారు. భారతీయ జీవన విధానంలో ఇది భాగమైపోయిందని వివరించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్‌సహా జిల్లాలోని అధికారుల కృషిని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజలకు అపారమైన నమ్మకముందని చెప్పారు. విశాఖలో జరుగనున్న యోగాంధ్రా వేడుకలతో ఒక సరికొత్త చరిత్ర రాయబోతున్నామని, శ్రీకాకుళం నుంచి పెద్దసంఖ్యలో సాధకులు పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఈ పి.యోగేశ్వరరావు, డీఈఈ సిహెచ్.వెంకటేశ్వరరావు, ఏఏఇ సురేష్, ఎస్.వెంకట్రావు, బ్రహ్మకుమారీస్ సంస్థ నుండి జయలక్ష్మి, రమణ, రాధ, నిర్మల, యోగా గురువులు పాండ్రంకి మురళీకృష్ణ, జాడ చంద్రశేఖర్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా సురేష్ కుమార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా కూటికుప్పల సురేష్‌కుమార్ నియమితులయ్యారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో ఆ సంఘ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నాగళ్ల మురళీధర్, జిల్లా కార్యదర్శిగా కవిటి దేవరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శిగా కిల్లి కుమారస్వామిని నియమించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. గ్రామీణ స్థాయి నుండి బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు, రాష్ట్ర ఇంచార్జ్ వై.నూకణమ్మ, రాష్ట్ర కార్యదర్శి పిళ్ళా కన్నన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.





తెలుగునాట కళలకూ, కళాకారులకూ లోటులేదు. పాడగలిగీ, పాటపై అమితమైన ప్రేమకలిగీ అవకాశాలు రాక మరుగునపడిపోయిన ఎందరో గాయనీ గాయకులు ఈ వేదిక ద్వారా మనందరికీ కొన్ని దశాబ్దాలుగా వీనులవిందు చేస్తున్నారు. అదే అలవరసలమీద నిర్వహించే సరిగమప, సూపర్‌సింగర్ కార్యక్రమాలు సైతం చక్కని గాయనీగాయకుల్ని మనందరికీ అందించాయి. దాదాపుగా వీరందరూ ఏదో రూపాన వివిధ రంగాల్లో తమ పాటవాన్ని ప్రదర్శిస్తూ తమ గొంతు ఆగకుండా వినిపిస్తున్నారు. కొందరు సినిమా పాటల్లో బిజీ అయిపోతే, మరికొందరు డబ్బింగ్ కళాకారులుగాను, ఇంకొందరు ప్రపంచవ్యాప్తంగా వివిధ షోల్లోను తమ గళాలను నిర్విరామంగా వినిపిస్తున్నారు. అయితే ఇందులో చాలామంది యుక్తవయస్కులు. సుమారుగా నలభైలోపువారే!

# రామోజీ-బాలు కలిసి జాతికందించిన అద్భుతమైన కానుక!

## - లెజెండరీ ప్రోగ్రామ్‌ను పాడు చేయవద్దు

వీరందరూ పాడే పాటలు మనం తరచూ వింటూనే ఉన్నాం. ఏ ఒక్కరూ ఫలానా పాట సరిగా పాడలేదనే అపవాదును మూటగట్టుకోకుండా సాధ్యమైనంత అందంగా పాడుతున్నారు. కానీ సాహిత్యం మాటేమిటి? గీతరచయిత ఎన్నో నిద్రలేని రాత్రుళ్లు గడిపి, ఎంతో ఇష్టపడి కూర్చిన పాటలోని పదాలను బాధ్యతాయుతంగా పలకాల్సిన అవసరం ఉందాలేదా?

కీరవాణి.. ***చిలకలా కొలికిరో*** పాటనే చూడండి: ఇటీవల చాలాసార్లు వినగా వినగా బయటపడిన విషయం ఏమిటంటే ***'పడుచుల మనసుల పంజర సుఖముల...'*** అని పాడుతున్నారు. అది ***పంజర సుఖములు కాదండీ బాబూ, పంజర శుకములు.*** రమ్య బెహరా అలా పాడుతోంటే పక్కనే ఉన్న బాలుగారైనా సరిచెయ్యాలి కదా? విసిగిపోయారేమో మరి?

అలాగే ***'నెలరాజా ఇటుచూడరా...'*** పాటలో కవిగారు ఒక గమ్మత్తైన ప్రయోగం చేశారు: ***'తగువేళరా... తగువేలరా'*** అని. దాన్ని ఈ పిల్లకాయలు కొందరు ***'తగువేళరా తగువేళరా...'*** అని పాడేస్తున్నారు. అది బాధాకరమైన విషయం. రచయిత కృషి బూడిదలో పోసిన పన్నీరైపోయింది. అలాగే ఆమధ్య ఇళయరాజాకి సమర్పించిన ఒక అద్భుతమైన మెడ్లీలో అందరూ చాలా చక్కగా పాడారు. ఏ ఒక్కపాటనూ ఎంచడానికి లేదు. కానీ ఒకమ్మాయి ***'ఎన్నో రాత్రులొస్తాయిగానీ...'*** పాటలో ***'పెదవి కొరికే.. పెదవి కొరికే..'*** అని పాడేసింది. అది ***'పెదవి కొరికే.. పెదవి కొరకే..'*** వేటూరి, ఇళయరాజా కలిసి మనందరి మనసుల్నీ ఛిద్రం చెయ్యడానికి తయారుచేసిపడేసిన అంత రొమాంటిక్ పాటలో పదాల్ని అలా మార్చిపడేస్తే, మార్చిపాడేస్తే ఆయన ఆత్మ ఘోషిస్తుంది తల్లీ! తప్పు! సరిచేసుకో!

ఈమధ్య పాడుతా తీయగాలో ఒక కుర్రాడు ఒక పాత పాట సెలెక్ట్ చేసుకుని పాడాడు. అది నటశేఖర కృష్ణ నటించిన 'గౌరి' చిత్రంలోది. ***'గలగల పారుతున్న గోదారిలా...'*** అనేపాట. ఆ మొదటి లైన్లనే పోకిరిలో మళ్ళీ వాడుకున్నార్లెండి. అదిక్కడ అప్రస్తుతం. ఆ పాట చాలా బాగా పాడాడు ఆ కుర్రాడు. కానీ రెండో చరణంలో ***సత్యం ధర్మం నిలుపుటే... న్యాయంకోసం పోరుటే... పేదల సేవలు చేయుటే...*** ఇదీ సాహిత్యం. కానీ ఆ కుర్రాడు ***'పేదలు సేవలు చేయుటే..'*** అని పాడాడు. పేదలకి సేవలు చెయ్యాలని కవిభావం. పేదలు మనకి సేవలు చెయ్యాలని అతగాడి పాటలో వినబడిన భావం.

ఎదురుగా చంద్రబోస్ ఉన్నారు. ఆయన తప్పనిసరిగా సరిచేయాలి. కానీ చెయ్యలేదు. అదిగో... సరిగ్గా ఇటువంటి సందర్భాల్లోనే బాలు గుర్తొస్తాడు. అటువంటివి అక్షరదోషాలు కావు. ళ, ణ, ష... అక్షరాలకు బదులు ల, న, స.. పాడితే అర్థంచేసుకోవచ్చు. కానీ మొత్తం అర్థమే మారిపోయేలాను, రచయిత రాసిన పాటలో అందమైన భావాలే కనుమరుగయేలాను పాడితే బాధనిపిస్తుంది. ఆయన అటువంటి పొరపాట్లను సరిచేసేవారు. ఒక్కోసారి ఆ పాట వెనుక ఉన్న కాస్త చరిత్రనో, ఆ రికార్డింగ్ సందర్భంలో జరిగిన విశేషాలనో నెమరువేసుకునేవారు. కేవలం ఏదో ఒకమూల ఒక చిన్న వాద్యపరికరం వాయించే కళాకారుణ్ణి సైతం గుర్తించి, అతగాణ్ణి నిలబెట్టి అందరి మన్ననలూ పొందేలా పరిచయవాక్యాలు పలికేవారు. మౌనగీతం చిత్రం కోసం ***'పరువమా... చిలిపి పరుగు తీయకు..'*** అనే జాగింగ్ పాట బాలు తమిళ్‌లో పాడుతున్నారు ఒక స్టేజ్‌మీద. సహగాయని జీన్స్ శ్రీనివాస్ కూతురు. అయితే ఆ పాటలో అడుగుల శబ్దం మొత్తం పాటంతా వినబడాలి. దాన్ని ఒక తబలా కళాకారుడు ఎలా వినిపించాడో తెలుసా? కింద కూర్చుని తన రెండు తొడల మీదా రెండు చేతులతోనూ టప్ టప్ టప్ అని కొట్టుకుంటూ పాటంతా నడిపాడు. చివరలో బాలు అతగాణ్ణి లేపి, ఆ పాటకు అంత అందాన్ని తీసుకొచ్చిన ఆ అడుగుల సవ్వడికి అతనే కారణమంటూ పరిచయం చేశారు. ఆ వేదికలో ఉన్నవారికే కాదు, చూస్తున్న మనకూ కృతజ్ఞతంటే ఏమిటో నిరూపితమైన క్షణాలవి. ఇంతకీ నా సొదేవిఁటంటే.... సాహిత్యం జాగ్రత్తగా వినండి. ఒకవేళ తెలియకపోతే కాస్త తెలుగు బాగా తెలిసినవారిని అడిగి తెలుసుకుని సరిచేసుకోండి. మీ కాన్వెంట్ చదువుల పరిణామంలో అదేమంత నేరం కాదు. 'అయ్యో, ఇదికూడా తెలీదా?' అని ఎవరూ అనరు. మీరు తెలుగుపాటను కలకాలం జవజీవాలతో నిలబెట్టాల్సిన బాధ్యతను భుజాలపై మోస్తున్నారు. ఘంటసాల, సుశీల, జానకి, పి.బి.శ్రీనివాస్, ఏ.ఎం.రాజా, బాలు, జిక్కీ, లీల ఇలా ఎందరో గాయనీ గాయకులు మన తెలుగుపాటను స్వచ్ఛమైన భాషలో పలికించారు. ఇప్పుడు మీవంతు. ఇక్కడ మరొక విషయం: నేను వెలిబుచ్చిన ఈ అభిప్రాయాలు కేవలం ప్రస్తుతం ఉన్న తెలుగు గాయకుల గురించి మాత్రమే! అనవసరంగా సిద్ శ్రీరామ్, హరిహరన్, అర్మాన్ మాలిక్, నకాష్ అజీజ్ అంటూ పరభాషా గాయకుల్ని ఇక్కడ నిందించకండి. వారి భాషలో వారంతా ఎలా పాడతారో మనకు తెలీదు. కానీ మన భాషలో కచ్చితంగా తప్పులు దొర్లుతాయి. వాటిని గురించి కాదు ఈ చర్చ. ఇక పాటల కార్యక్రమాలు నిర్వహించే సెలెబ్రిటీలు తప్పకుండా గౌరవించదగిన వ్యక్తులే! వారందరూ ఎంతో కృషిచేసి ఉన్నత స్థాయికి చేరుకున్నారనడంలో సందేహం లేదు. కానీ ఛానెల్ యాజమాన్యం చెప్పిందనో, చూసేవారు, పిల్లకాయల తల్లిదండ్రులు బాధపడతారనో మీమీ అభిప్రాయాలు చెప్పకుండా వదిలేయకండి. అనవసరమైన ఆర్భాటాలు, గాల్లో ముద్దులు, కౌగిలింతలతోనుబీ బాంబులు, చిచ్చుబుడ్లు స్టేజీమీద కాల్చడంతోను పాటలో సత్తాను పెంచే ప్రయత్నం చెయ్యకండి. అక్షరాన్ని, భావాన్ని కాపాడాల్సిన బాధ్యత మీదే! దశాబ్దాలుగా ఇక్కడే ఉంటూ ఇప్పటికీ తెలుగు చదవడం, మాట్లాడటం సరిగా రాదనే రాజకీయనాయకులు, నాయకురాళ్ల మధ్య జీవిస్తున్నాం. వారు కాదు మన భాషను సంగీతసాహిత్య సమలంకృతం చెయ్యాల్సింది. మీరు. మీ అడుగుజాడల్లో నడిచే ఆ పిల్లలు. వారందరికీ దేవుడిచ్చిన గొప్ప వరం వారి గళం. దానికి సంగీతమనే తావి అబ్బింది. అది మా చెవులను తాకితే పులకింత కలగాలి. 'ఆహా, ఎంత స్పష్టంగా పాటను అర్థంచేసుకుని పాడుతున్నారు! ఇదికదా భాగ్యము!' అనిపించాలి. ఇక యాసల సంగతి. ఇటీవలి కాలంలో మనందరికీ ఎక్కువగా వినిపిస్తున్న పాటల్లో తెలంగాణ, ఉత్తరాంధ్ర, రాయలసీమ మాండలికాల యాస. అది హాయిగా ఆస్వాదిద్దాం. పాటను జనానికి చేరువయ్యేలా చేసే ప్రక్రియ అది. దానికీ ఈ రచనకూ ఎటువంటి సంబంధమూ లేదు. అంచేత... గీతరచయిత తపననూ, కృషినీ, భావాన్నీ వృధా పోనీయకండి. శుభాశీస్సులు!

- కొచ్చెర్లకోట జగదీశ్



## తల్లికి వందనం అందరికీ వర్తింపజేయడం గొప్ప అవకాశం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

తల్లికి వందనం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ కార్యక్రమం ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కేవి రాములు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథి ఆమదాలవలస మాజీ మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి తమ్మినేని గీతా విద్యాసాగర్ మాట్లాడుతూ చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం స్కీమును వర్తింప చేయడం గొప్ప విషయం అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి ప్రశంసనీయమని తెలిపారు. మరో ముఖ్య అతిథి తమ్మినేని విద్యాసాగర్ మాట్లాడుతూ గత సంవత్సరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. విద్యావేత్త శ్రీ సంజీవరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆమదాలవలస మంచి ఫలితాలు సాధించిన పదవ తరగతి ముగ్గురు విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున బహుకరిస్తానని హామీ ఇచ్చారు. హెడ్మాస్టర్ కె వి రాములు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయాలను తెలియజేశారు. ఎన్నిసి లాంటి యూనిట్లు కలిగిన పాఠశాలగా గొప్ప గుర్తింపు కలిగి ఉందని ఇతర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ నాణ్యమైన శాస్త్రీయ విద్యను అందించడానికి ఉపాధ్యాయ వర్గం కృషి చేస్తుందని తెలిపారు. ఎస్ఎంసి చైర్పర్సన్ చిగురుపల్లి సునీల మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీని ఇచ్చారు. స్టాఫ్ సెక్రటరీ పైడి రామస్వామినాయుడు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి పట్టణ పెద్దలు సహకరించడానికి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పట్టణపెద్దలు, చిట్టివలస సర్పంచ్ గుజ్జల లక్ష్మణరావు, సిహెచ్ నరేష్, గంధం వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రకిట్లను తమ్మినేని గీతా విద్యాసాగర్ ఆధ్వర్యంలో పెద్దలు విద్యార్థులకు అందించారు. కార్యక్రమం కోట ఈశ్వరరావు వందన సమర్పణతో ముగిసింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పి.రవికుమార్, పి.మోహనరావు, బి.శరత్కుమారి, షేక్ పావలి, బివి శివాజీ, సిహెచ్ సుబ్బలక్ష్మి, జి.అప్పారావు, పిసిహెచ్ మనోహరరావు, ఎం.ఉమాకుమారి ఎం.వి.రామబట్లు, ఎస్.అరుణ, ఎస్.సులోచనరాణి, ధనలక్ష్మి, నాగేశ్వరరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.





బోయిన్ గోవిందరాజులు కుటుంబాన్ని మాజీమంత్రి గౌతు శివాజీ, ఎమ్మెల్యే గౌతు శిరీషలు గురువారం పరామర్శించారు., గోవిందరాజులు తల్లి ప్రేమకుమారి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. వారితోపాటు మల్లా శ్రీను, శాసనపూరి మురళి, టంకాల రవి ఉన్నారు. – సత్యంన్యూస్, టెక్కలి

## యోగ మానసిక వికాసానికి ఒక మార్గదర్శి



(సత్యంన్యూస్, బూర్జ)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'యోగా ఆంధ్ర'లో భాగంగా గురువారం బూర్జ మండలం ఓవీ పేట ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బందితో యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు యోగాను దినచర్యగా చేసుకోవాలన్నారు. దీని వల్ల ఆరోగ్యం సిద్ధించడంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన చక్కని మార్గమని తెలిపారు. యోగాపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగాసనాలు ఒక భాగం కావాలని, ఆరోగ్యంగా జీవించేందుకు యోగాసనాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 60వేల మంది నమోదు చేసుకున్నారని, జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి పల్లెలో యోగాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యోగ గురువు బుడుమూడు సూర్యారావు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు. ఇంచార్జ ప్రిన్సిపాల్ చింతాడ కృష్ణారావు. పి రమణమూర్తి సిహెచ్ సురేష్ కుమార్ తదితరు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

## గిరిజన గ్రామంలో రెడ్డి శాంతి పర్యటన

(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

మెళియాపుట్టి మండలం, గొట్టిపల్లి పంచాయతీలోని చందనగిరి గిరిజన గ్రామాన్ని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి గురువారం సందర్శించారు. ఎత్తైన కొండలపైఉన్న ఈ గ్రామంలో గిరిజనుల కష్టాలను నేరుగా తెలుసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చందనగిరితోపాటు మరికొన్ని గిరిజన గ్రామాల్లో పర్యటించి, కూటమి ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, వారి హక్కులను కాలరాస్తోందని అన్నారు. గిరిజనులు రేషన్ తెచ్చుకోవడానికి పడుతున్న ఇబ్బందులను బాధగా ఉందన్నారు. చందనగిరి గ్రామంలోని గిరిజనులు రేషన్ కోసం సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నేలబొంతు గ్రామానికి కాలినడకన వెళ్లాల్సి వస్తుందని, ఇది వారికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందన్నారు. గిరిజనులు వారికి వైకాపా పాలనలో రోడ్డు నిర్మించినందున వారికి జీవనోపాధికి, రవాణా సౌకర్యం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.



## యోగసాధనతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు

(సత్యంన్యూస్, టెక్కలి)

యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని బీజేపీ మండల అధ్యక్షులు జర్జాన రాంజీ అన్నారు. ప్రధానమంత్రి పిలుపుమేరకు మండలంలోని స్థానిక సైనికనగర్‌లో ఆయన యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగ చేయడం వలన మానసికంగా చాలా సంతోషం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగా భాగం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. తమ ఆరోగ్య సమస్యలన్నిటినీ కాపాడేది ఒక్క యోగనేనని తెలిపారు. నెల 21న విశాఖపట్నంలో జరుగునున్న యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్నారని, ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.



## యోగా దినోత్సవం ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకోవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖపట్నంలో ఈనెల 21న ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న యోగా దినోత్సవంలో ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. శ్రీకాకుళం జిల్లాకు కేటాయించిన బ్లాక్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. యోగా దినోత్సవ రోజున చేపట్టబోయే యోగాసనాలపై శిక్షణ తీసుకుంటున్న మహిళలను పలకరించి పలు సూచనలు చేశారు. యోగాతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జెసి ఫార్మన్ అహ్మద్, పరిశ్రమల శాఖ అధికారి, సుడా చైర్మన్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు సంస్థాగత ఎన్నికలు ముఖ్యం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు నరసన్నపేట నియోజకవర్గంలోని జలుమూరు మండలం సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా నియమించిన సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి సంస్థాగత ఎన్నికలు పూర్తి కోసం చర్చించారు. మండలస్థాయి కమిటీలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యనిర్వాహక కార్యదర్శులు ముగ్గురు, కార్యదర్శులు ముగ్గురు ఉంటారన్నారు. అదేవిధంగా అనుబంధకమిటీలో పదిమంది సభ్యులు ఉంటారన్నారు. తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా పటిష్టమైన వ్యవస్థ. పదవులు పొందేవారు తప్పనిసరిగా పార్టీ క్రియాశీలక సభ్యత్వంతోపాటు కుటుంబ సాధికారిక సారథులుగా నమోదై ఉండాలన్నారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో రాష్ట్ర తూర్పు కాపు కుల సాధికారిక డైరెక్టర్ పాండ్రంకి శంకర్‌లు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తప్పవు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల పోరాటాలు ఉధృతం చేస్తామని యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్నటువంటి పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని, తల్లికి వందనం పథకంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికుల యొక్క జీతాలు పెంచి వారికి న్యాయం చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వర్షాకాల దృష్ట్యా రైన్‌కోట్స్ ఇవ్వాలన్నారు. భద్రతా పరికరాలు అందించాలని, నగర జనాభా కనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రమాద బీమా అమలు చేయాలని, స్థానిక సమస్యలపై కమిషనర్ కార్మికసంఘం నాయకులతో చర్చలు జరిపి ఒక్కో సమస్య పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం 36రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సంఘీభావం ప్రకటించి వారికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జీ గణేష్, తంగి నారాయణరావు, తుపాకుల శ్రీను, సుమన్, సోగ్గాడు, రసూల్, అర్జీ లక్ష్మి, ద్రాక్ష, సుహాసిని తదితరులు పాల్గొన్నారు





## యోగాంధ్ర విజయం కోసం స్వచ్ఛందంగా ముందుకొద్దాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశాఖపట్నంలో జరుగుతున్నా ప్రతిష్టాత్మక యోగ వేడుకల్లో పాల్గొని స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చారు. ఇందుకు సంబందించిన వివరాలను ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ గురువారం విశాఖపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. తామంతా వైద్య ఆరోగ్యశాఖలో ఆరోగ్య సహాయకులుగా ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న యాభైఏళ్ళు దాటిన వాళ్ళమన్నారు. కోర్టు ఆదేశం పేరుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు వెయ్యి మందిని ఒక్కసారిగా విధులు నుంచి తొలగించడంతో హఠాత్తుగా రోడ్డున పడ్డామన్నారు. నెలలు గడుస్తున్నా నేటికీ విధుల్లోకి తీసుకోలేదన్నారు. కానీ మెరిట్‌లో వున్నా వారికి ఎటువంటి అన్యాయం జరగదని అంటున్న ఉన్నతాధికారుల మాటల ఊరటతో తప్పకుండా తమకు న్యాయం జరుగుతుందని ఏడు నెలలుగా ఎదురుచూస్తున్నామన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా విశాఖలో జరుగుతున్న అంతర్జాతీయ యోగ దినోత్సవ సంబరాల్లో యోగాంధ్రా విజయం కోసం ఆరోగ్యాంధ్రా సాధన కోసం స్వచ్ఛంద్దంగా వాలంటీర్లుగా సహాయ సహకారాలు అందించేందుకు తాము విశాఖ వచ్చామని ఉద్యోగాలు కోల్పోయిన ఆరోగ్య సహాయకులు అంటున్నారు. వైద్య ఆరోగ్యపరంగా సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొవడం తమకు నిత్యకృత్యమేనన్నారు. ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనాను సైతం ఎదుర్కోవడంలో ప్రాణాలకు తెగించే పని చేశామన్నారు. విజయవాడ ఒక్కసారిగా ముంపునకు గురై మునిగిపోతుంటే యుద్ధభూమిలో సైనికుల్లా ఎలాంటి అంటురోగాలు రాకుండా అహర్నిశలు శ్రమించామన్నారు. వరదలు, తుఫానులు వచ్చినప్పుడు తాము చేసే సేవలు అనంతమన్నారు. అలా నిరంతరాయంగా శ్రమించే మేము ఉద్యోగాలు కోల్పోయినా అదే స్ఫూర్తితో స్వచ్ఛంధసేవకు ముందుకొచ్చామని చెప్పుకొచ్చారు. వైద్య ఆరోగ్యశాఖలో గ్రామీణస్థాయిలో కీలకభూమిక పోషించే ఆరోగ్య సహాయకులకు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని వారు కోరారు. చిరుద్యోగులమైన తాము ఉద్యోగాలను కోల్పోవడంతో కుటుంబాలు అన్ని విధాలుగా చిన్నాభిన్నమై రోడ్డున పడిపోయాయని వారు రోదిస్తున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ పి.ఎన్.వి.ఎస్.ప్రసాద్, ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్లు ఆడారి మల్లేశ్వరరావు, ఎం.ఎన్.ఎస్.వీ. ఆర్.నాయిడు (శ్యామ్), పెంటకోట పేరినాయుడు, శరగడం అప్పలనాయిడు, మహ్మద్ సుభాని, తారకేష్, టి.శంకర్, మీసాల షణ్ముఖరావులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను పట్టణంలోని ఆర్&బి అతిథిగృహంలో టీడీపీ యువనాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్‌నాయుడు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చీపురుపల్లిలో నూతన కోర్టు బిల్డింగ్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.
– సత్యంన్యూస్, చీపురుపల్లి

## వైకాపా బలోపేతానికి కార్యకర్తలే కీలకం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం క్యాంపు కార్యాలయంలో రణస్థలం పంచాయితీ కార్యకర్తలతో "కార్యకర్తే కీలకం" కార్యక్రమంలో భాగంగా రెండవరోజు కార్యకర్తలలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే కీలకమని వారి శక్తి, ఉత్సాహం ప్రేరణాదాయకమని, కొన్ని సంవత్సరాలుగా పార్టీ బలోపేతం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలు మరువలేమన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. అలసత్వం వద్దని ఇప్పటి నుండే పార్టీ ప్రతీ కార్యకర్త అప్రమత్తంగా ఉండి పార్టీ విజయం కోసం అన్ని ప్రయత్నాలు చేయాలనీ ఆదేశించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాబోయే ఎన్నికలలో విజయం సాధిస్తామన్నారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా తనను సంప్రదించాలని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కరిమజ్జి భాస్కరరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, ఎంపీటీసీ కరిమజ్జి రమణ, నాయకులు మహంతి జోగినాయుడు, చందక రమణ, మహంతి గురునాయుడు, పసుపురెడ్డి సురేష్, కెల్ల ఆదినారాయణ, కలిశెట్టి భద్రయ్య, కెల్ల కోటేశ్వరరావు, లుకలాపు దుర్గారావు, పెద్దింటి శ్రీను, గెడ్డపు వరం, కుప్పిలి పైడిరాజు, కలివరపు సూర్యనారాయణ, కుప్పిలి గురువులు, గొర్లె కేశవరావు, నేతల కేశవరావు, కెల్ల గొల్ల, కెల్ల భాస్కర్ రావు, కుడితి ఈశ్వరరావు, పడాల రామారావు, పున్నాన తవుడు, లంక సూర్యనారాయణ, లంక వాసు, లంక వరం, లంక లచ్చుము, లంక శ్రీను, లంక నారాయణరావు, లంక అప్పల నాయుడు, లంక విశ్వేశ్వరరావు, మీసాల శ్రీరామ్, కెల్ల రాంబాబు, వండాన రమణలు పాల్గొన్నారు.















# సర్కారు సేవల వారధి.. దయానిధి!

- మూడు దశాబ్దాల సుదీర్ఘ సర్వీసులో ఎన్నో విజయాలు
- భూసేకరణ వివాదాల పరిష్కారంలో దిట్టగా పేరు
- ఏ హోదాలో.. ఎక్కడ పని చేస్తున్నా ప్రజల పక్షమే
- డిప్యూటీ తహసీల్దార్ నుంచి స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయికి



**డి.వి.రమణ**, సత్యం ప్రత్యేక ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఒక ఎత్తు.. సర్వీసులో ఎత్తుపల్లాలు అధిగమిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించడం మరో ఎత్తు. ప్రభుత్వ ఉద్యోగులు లక్షల్లోనే ఉంటారు. కానీ సర్వీసుల్లో ప్రజలకు, ప్రభుత్వానికి ఏదో చేశామని, ఎంతో సాధించామన్న ఆత్మసంతృప్తి కొందరికే లభిస్తుంది. ఏళ్ల తరబడి ప్రమోషన్ లేకపోయిన నిరాశ చెందకుండా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ.. తమకు అప్పగించిన బాధ్యతలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేవారు అరుదుగా ఉంటారు. అటువంటి అరుదైన అధికారుల్లో బలివాడ దయానిధి ఒకరు. డిప్యూటీ తహసీల్దార్‌గా మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వ సర్వీసులో చేరిన ఆయన సుమారు 15 ఏళ్లు ఆలస్యంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా అధికారికంగా పదోన్నతి పొందినా కొన్నేళ్ల క్రితం నుంచే ఆ హోదాలో పని చేస్తున్నారు. ఆ హోదాలో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ముఖ్యంగా పలు ప్రాజెక్టుల భూసేకరణ విభాగాల్లో పని చేసి.. వివాదాలకు అతీతంగా వ్యవహరించడం ద్వారా అటు ప్రభుత్వ, ఇటు రైతుల మన్ననలు పొందారు. ప్రస్తుతం విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) ఎస్టేట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న దయానిధితోపాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 58 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి 2010లోనే అందాల్సిన ఈ ప్రమోషన్లు పలు కారణాలతో ప్రభుత్వ స్థాయిలో నిలిచిపోయాయి. ఎట్టకేలకు సమస్యలన్నింటినీ పరిష్కరించి ప్రమోషన్ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. దాంతో ఇప్పుడు కొత్త హోదాలోనే దయానిధి వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా కొనసాగనున్నారు.

**మూడు దశాబ్దాల ప్రస్థానం**

ఏపీపీఎస్సీ 1995లో నిర్వహించిన గ్రూప్-2ఏ నియామక పరీక్షల్లో విజయం సాధించిన దయానిధి ఏడాది శిక్షణ అనంతరం 1996లో సారవకోట డిప్యూటీ తహసీల్దార్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నారు. అనంతరం 1999-2000 మధ్య సంతకవిటిలో, 2003-2004 మధ్య కంచిలి తహసీల్దార్‌గా పని చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ క్యాడర్‌లోకి వెళ్లారు. 2011-12 మధ్య సింహాచలం దేవస్థానం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ ప్రొటెక్షన్)గా, 2012-13 మధ్య పాలకొండ ఆర్డీవోగా, 2013-14 మధ్య విశాఖలో నేవీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ)గా పని చేశారు. 2014-18 మధ్య శ్రీకాకుళం ఆర్డీవోగా, 2018-19 మధ్య ఉమ్మడి విశాఖ జిల్లా డ్వామా పీడీగా, 2019లో రాజమండ్రిలో గెయిల్(గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)గా, 2019-22 శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా, 2022-23 మధ్య అల్లూరి(పాడేరు) జిల్లా రెవెన్యూ అధికారిగా, 2023-24 మధ్య అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారిగా విశేష సేవలు అందించిన దయానిధి ఈ ఏడాది జనవరిలో ప్రతిష్టాత్మకమైన వీఎంఆర్‌డీఏకు ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు.

**శ్రీకాకుళం జిల్లాలో కీలక బాధ్యతలు**

తన సర్వీసులో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ కాలంలో వివిధ హోదాల్లో పని చేసిన దయానిధి.. ఎన్నో ముఖ్యమైన టాస్క్‌లను నిబద్ధతతో చాకచక్యంగా పూర్తి చేసి ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారు. పాలకొండ ఆర్డీవో బాధ్యతలు స్వీకరించడానికి కొద్దిరోజుల ముందే వంగర మండలం లక్ష్మీపేటలో ఐదుగురు దళితుల ఊచకోత ఘటన తీవ్ర ఉద్రిక్తలకు దారి తీసింది. ఆ తరుణంలో ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దయానిధి ఆ ప్రాంతంలో శాంతిభద్రల పరిరక్షణ, బాధితులకు పునరావాసం కల్పించడంతోపాటు సాధారణ పరిస్థితులు పునరుద్ధరణకు తీవ్రంగా కృషి చేసి విజయం సాధించారు. ఇక శ్రీకాకుళం ఆర్డీవోగా ఉన్నప్పుడే ఆ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా కూడా వ్యవహరించారు. శ్రీకాకుళం ఆర్డీవోగా ఉన్నప్పుడే కొవ్వాడ అణువిద్యుత్ ప్రాజెక్టు, వంశధార ప్రాజెక్టు, నారాయణపురం కాలువకు సంబంధించిన భూసేకరణ, పునరావాస పనులను పర్యవేక్షించారు. రణస్థలం మండలం కొవ్వాడలో కేంద్రం తలపెట్టిన అణువిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి 1400 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు ఆ ప్రాంత రైతుల నుంచి సుమారు 600 ఎకరాలను భూములను సేకరించారు. దీని కోసం ప్రత్యేకంగా భూసేకరణ యూనిట్ ఏర్పాటు చేసినప్పటికీ రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం మధ్య నష్టపరిహారం, పునరావాసం విషయంలో సమన్వయం కుదిర్చి ఆమోదయోగ్యమైన ఒప్పందం జరిగేలా అప్పటి ఆర్డీవో దయానిధి కృషి చేశారు. ఇక వంశధార ప్రాజెక్ట్ హిరమండలంలో ఉన్నప్పటికీ పునరావాస ప్రాంతాల్లో ఎక్కువ భాగం శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఉండటం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణం, నిర్వాసితులకు సౌకర్యాల కల్పన, పెండింగ్ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో చొరవ తీసుకున్నారు. వంశధార రిజర్వాయర్, నారాయణపురం ఆనకట్ట మధ్య హై లెవల్ కాలువ విస్తరణకు అవసరమైన అదనపు భూసేకరణ సమయంలో బాధిత రైతులకు తగిన పరిహారం లభించేలా మార్కెట్ విలువలను సవరించడానికి దయానిధి చొరవ తీసుకున్నారు. దాంతో వివాదాలకు తావు లేకుండా భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. అలాగే ఎచ్చెర్లలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల గుర్తింపు, సేకరణ దయానిధి హయాంలోనే జరిగాయి. జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌కు కొత్త కాంప్లెక్ నిర్మాణానికి అవసరమైన భూమిని కూడా దయానిధి ఆధ్వర్యంలోనే జరిగింది. సిద్ధిపేట గ్రామానికి చెందిన ఐదు ఎకరాల గ్రామకంఠం భూమిని అటవీ శాఖకు బదిలీ చేయడానికి, తద్వారా అటవీ శాఖ భూమికి కొత్త కలెక్టరేట్ కాంప్లెక్‌కు కేటాయించేలా చేశారు. సిద్ధిపేట భూమిపై అనేక వివాదాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ పరిష్కరించారు.

**విశాఖ జిల్లాలో కీలక బాధ్యతలు**

విశాఖ జిల్లాలోనూ పలు కీలక బాధ్యతలు నిర్వర్తించిన దయానిధి అదే సమయంలో ఎన్నికల విధులు కూడా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ రక్షణ)గా పనిచేస్తున్నప్పుడు 2012లో పాయకరావుపేట అసెంబ్లీ ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా. విశాఖ నేవీ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నప్పుడే 2014లో ఎలమంచిలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా పని చేశారు. 2023లో భారత ఎన్నికల సంఘం మణిపూర్ రాష్ట్రంలోని సైతు నియోజకవర్గ పరిశీలకుడిగా ఇతన్నే పంపింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్వోగా, అదే సమయంలో అనకాపల్లి జిల్లా ఎన్నికల అధికారిగా పని చేశారు. బాధ్యత ఏదైనా న్యాయం చేయడంలో దిట్ట అని దయానిధి తన సమర్థతతో నిరూపించుకున్నారు.

## ఆధార్ ఒకటే.. 50 కనెక్షన్లట!

(మొదటిపేజీ తరువాయి)

ఆ 50 విద్యుత్ కనెక్షన్లు గోవిందరావు అనే వ్యక్తి పేరుతో ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. పేరు కామన్‌గా ఒక్కటే ఉన్నా ఇంటి పేరు, సర్వీసు సంఖ్య మారాయి. దీన్ని సరిచేయాల్సిన అధికారులు బాధితుడిని సర్దిచెప్పి పంపించేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆటో నడుపుకుని జీవిస్తున్న గోవిందరావు ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నా తల్లికి వందనానికి అనర్హులుగా మిగిలిపోయారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తప్పును సరిదిద్ది తమ ఇద్దరు పిల్లలు తల్లికి వందనానికి అర్హులయ్యేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

**ఇలాంటి బాధితులెందరో!**

గోవిందరావు లాంటి బాధితులు జిల్లా వ్యాప్తంగా చాలామందే ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. వీరంతా విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నెలకు 300 యూనిట్లకు మించి వినియోగించారని తల్లికి వందనం పథకానికి అనర్హులంటూ సచివాలయాల్లో అనర్హుల జాబితాలో తమ పిల్లల పేర్లు నమోదు కావడాన్ని చూసి వారి తల్లిదండ్రులు తమకు వచ్చిన విద్యుత్ బిల్లులు పట్టుకొని విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. దీనికి తోడు గతంలో సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డును అర్హత ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఇప్పుడు దానితోపాటు మరికొన్ని అర్హత ప్రమాణాలను కూడా నిర్దేశించింది. అందులో 300లోపు యూనిట్ల విద్యుత్ వినియోగం ఒక ప్రామాణికం. నెలకు 299 యూనిట్ల కంటే ఒక్క యూనిట్ అధికంగా వాడినా ఇప్పటివరకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిర్మొహమాటంగా కట్ చేసేస్తోంది. అది కూడా పౌరులకు చెందిన ప్రతి అంశాన్ని ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల లబ్ధిదారుల ఆధార్ నెంబర్ కొడితే చాలు.. వారి లెక్కలన్నీ బయటకొచ్చేస్తున్నాయి. అయితే ఆధార్ అనుసంధాన ప్రక్రియలో జరుగుతున్న తప్పిదాలు అర్హులైన పేదలను బలి తీసుకుంటున్నాయి. సంక్షేమ పథకాలకు అనర్హులను చేసేస్తున్నాయి.

## నగరంలో రెండు రోజులు కుళాయిలు బంద్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరపాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లలో కుళాయిల ద్వారా నీటి సరఫరా రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ దుర్గాప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. బలగ బుచ్చిపేట, పాలకొండ రోడ్డులో ప్రధాన నీటి సరఫరా పంపింగ్ లైన్ మరమ్మతులకు గురి కావడం వల్ల శుక్రవారం, శనివారం కుళాయి నుంచి మంచినీటి సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. ఇంతవరకు రెండుపూటలా కుళాయి నుంచి నీటి సరఫరా జరిగేదని, ఈ రెండు రోజులు ఒక్కపూట కూడా అందించలేమని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బాలిక వైద్యానికి రూ.20వేలు సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలిక వైద్యానికి పెద్దపాడు జనసేన నాయకులు బొట్ట శంకర్ సాయమందించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమాని, పెద్దపాడు వార్డు సచివాలయం పరిధిలో నివాసముంటున్న తొగరాపు పవన్ కళ్యాణ్ కుమార్తె భార్గవి గత 55 రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. గుండెలో హోల్స్ ఉండడం వల్ల సర్జరీ చేస్తే తప్ప పాప ప్రాణాలు కాపాడలేమని వైద్యులు తెలిపిన నేపథ్యంలో ఈ నిరుపేద కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సహాయం శంకర్ అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బోర చిన్నరావు, ఆవాల ఢిల్లీ, కొనారి యేశ్వత్, ఉదయ్, మోష్య, తేజ తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షురాలు వస్తున్నారా..? మాకు తెలీదే!

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకాకుళం వస్తున్నారు. అయితే ఈ సమాచారం జిల్లాలో కాంగ్రెస్ నాయకులెవరి వద్దా లేదు. ఇటీవల షర్మిల వ్యవహార శైలిని నిరసిస్తూ విశాఖపట్నంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలందరూ సమావేశమై ఢిల్లీలో ఉన్న అధిష్టానానికి తమ డిమాండ్లు పంపారు. అందుకోసమే ఇక్కడి నాయకులెవరికీ సమాచారం ఇవ్వలేదని భావించడం సబబు. అయితే రాష్ట్రంలో చచ్చిపోయిన కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ అధ్యక్షురాలు డీసీసీ కార్యాలయానికి వస్తే ఎవరితో మాట్లాడతారనేదే ప్రశ్న. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కేడర్‌కు దిశా నిర్దేశం చేయాల్సిన ఆమె ఆ కేడర్ లేకుండా ఏం చేస్తారని ప్రశ్న తలెత్తుతుంది. కాంగ్రెస్ భవనం వద్ద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణ, షర్మిల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ ఒకటి దర్శనమిస్తోంది. వాస్తవానికి కేంద్ర మాజీమంత్రి కృపారాణి ఈ పార్టీలోనే ఉన్నారు. గడిచిన ఎన్నికల్లో షర్మిలతో పాటు కడప ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొన్నారు. ఆమెకు కూడా షర్మిల వస్తున్న విషయం తెలియదు. రెండుసార్లు ఆమదాలవలసకు ఎమ్మెల్యేగా చేసి, ఓడిపోతామని తెలిసినా కూడా కాంగ్రెస్ తరఫున పోటీ చేయడానికి ప్రతీసారి త్యాగం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతికి కూడా ఈ విషయం తెలియదు. ఫ్లెక్సీల్లో కూడా వీరెవరి ఫొటోలూ కనిపించడంలేదు. గడిచిన ఎన్నికల్లో జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గెలుపు ఓటములు పక్కన పెడితే వారంతా ఇప్పుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు. వారికి కూడా కబురందలేదని భోగట్టా. ఇక పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ పరమేశ్వరరావుకు కూడా ఎటువంటి సమాచారం అందలేదు. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు షర్మిల సభ ఉన్నట్టు ఎక్కడా డీసీసీ అధ్యక్షుడు కృష్ణ ప్రకటించలేదు. అంటే ఆమె కాంగ్రెస్ నేతలతోనే మాట్లాడటానికి శ్రీకాకుళం వస్తున్నారు. ఇప్పుడు ఆ నేతలకే ఈమె వస్తున్నారన్న సమాచారం లేకపోవడం కొసమెరుపు.

## నగరంలో ఈద్గా మంజూరు చేయండి

- మంత్రి ఫరూక్‌ని కోరిన ఎమ్మెల్యే గొండు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలో ఈద్గా మంజూరు చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. జిల్లాకు విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దశాబ్దాల కాలం నుంచి శ్రీకాకుళం నగరంలో ముస్లింలు పండగ పూట సామూహికంగా నమాజులు చేసుకోవడానికి ఈద్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. నగరానికి చెందిన ముస్లింలు వారి పండగ రోజున నగరానికి చెందిన అన్ని మసీదుల జమాత్లు ఒకే చోట సామూహిక ప్రార్థనలు చేసుకునే ఈద్గా కోసం స్థలం, దాని నిర్మాణానికి అవసరమయ్యే నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. దీనికి మంత్రి ఫరూక్ స్పందిస్తూ నగరంలో అందుబాటులో ఉన్న వక్ఫ్ ల్యాండ్‌ని గుర్తించి ఈద్గాకు ఆ స్థలాన్ని కేటాయించాలని జిల్లా అధికారులకు ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో నగర టిడిపి మైనార్టీ అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ పూర్వపు సభ్యులు బహదూర్ భాష, టిడిపి మైనార్టీ నాయకులు ఎండి అన్వర్ బాషా, ఎండి రఫీ, షేక్ మొహమ్మద్, అబ్దుల్ గఫర్ ఖాన్, షేక్ హుస్సేన్, షేక్ సలీం, షేక్ హైసన్, సయ్యద్ సఫి, ఎండి షాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## జామియా మసీదు అభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర మైనార్టీ శాఖామంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చారిత్రకమైన జామియా మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర మైనార్టీ శాఖామంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ పేర్కొన్నారు. నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న ప్రాచీనమైన జామియా మసీదును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి మైనార్టీ నాయకులు మంత్రి ఫరూక్‌కు స్వాగతం పలికారు. టిడిపి మైనార్టీ నగర అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్ మసీద్ చరిత్రను, ప్రాముఖ్యతను మంత్రికి వివరించారు. ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ పూర్వపు సభ్యులు బహదూర్ బాషా మసీదు చుట్టూ ఉన్న ప్రహరీ గోడ శిథిలావస్థకు చేరుకుందని, తక్షణమే ప్రహరీ గోడని రిపేర్లు, ఎత్తు పెంచడానికి అవసరమైన నిధులు మంజూరు చేయమని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మసీదుకు అభివృద్ధికి నిధులు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా మంత్రి స్పందించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ద్వారా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు ఎండి అన్వర్ భాషా, ఎండి రఫీ, అబ్దుల్ గఫర్ ఖాన్, షేక్ హుస్సేన్, షేక్ సలీం, షేక్ హైసన్, షేక్ అహ్మద్ తాజ్, రావుఫ్‌ఖాన్, రహమతుల్లాఖాన్ పాల్గొన్నారు.

## పాతవారు పోయె.. కొత్త డాన్ వచ్చె..!

(మొదటిపేజీ తరువాయి)

చూసేందుకు జిల్లా వ్యాప్తంగా కొందర్ని రిక్రూట్ చేసుకుంటున్నారు. అందులో భాగంగానే ఈజీ మనీకి అలవాటుపడిన కొందరు బయట ప్రోపగండా మొదలుపెట్టి తమ దగ్గర పేకాడితే ఒక్క రాత్రిలోనే లక్షలు సంపాదించొచ్చవచ్చని మభ్యపెట్టి పేకాట శిబిరాలకు తరలిస్తున్నారు. జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఇటువంటి వారి మీద ఉక్కుపాదం మోపడంతో ఇప్పుడు కొత్త జనరేషన్ ఇందులోకి రిక్రూట్ అవుతుంది. అందులోని ఒకడే పోలాకి చెందిన చంద్ర.

**కాపుకాసి పట్టుకున్నారు.**

పేకాట శిబిరాలు నిర్వహించడం, ఆడడం, జట్టులుగా ఆడించడం, శిబిరాలకు జూదర్లను తరలించడం వీడి ఉద్యోగం. కొన్నేళ్ల క్రితం వరకు పేకాట శిబిరాల నిర్వాహకుల సహాయకుడిగా రోజువారి కూలీకి పనిచేశాడు. ఆ తర్వాత కొంత కాలానికి పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి కమీషన్ తీసుకొని జూదర్లను తరలించడానికి వాహనాలు సమకూర్చాడు. ప్రస్తుతం సొంతంగా పేకాట శిబిరాలు నిర్వహించడం మొదలుపెట్టాడు. నిర్వాహకులపై ఎస్పీ ఉక్కుపాదం మోపడంతో ఈ ఏడాది జనవరి నుంచి పేకాట శిబిరాల నిర్వాహకులు అన్నీ మూసుకు కూర్చున్నారు. దీన్ని అదనుగా చూసికొని చంద్ర ఒడిశాలోని కాశీనగర్, గురండి, రాణిపేట వద్ద మూడు శిబిరాలు ఏర్పాటుచేసి పేకాట ఆడిస్తున్నట్టు భోగట్టా. వారం క్రితం పేకాట శిబిరానికి వెళుతుండగా మెళియాపుట్టి వద్ద పోలీసులు కాపుకాసి పట్టుకున్నారు. రోజంతా స్టేషన్‌లో కూర్చోబెట్టి విడిచిపెట్టేశారు. దీంతో చంద్రకు ధైర్యం పెరిగిపోయింది. కాశీనగర్‌లో రామినాయుడు, రాణిపేటలో హిరమండలం పరిధిలోని అవలింగికి చెందిన చిన్నారావు, గోవిందరావు, గురండిలో పర్లాకిమిడికి చెందిన బుడ్డు, ఒడిశాలో ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్న కుమార్‌లతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ మూడు చోట్ల నిర్వహిస్తున్న శిబిరాలకు చంద్రానే బాస్ అని చెప్పుకుంటున్నారు. ఈ శిబిరాలకు మందస, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం నుంచి జూదర్లను వాహనాల్లో తరలించే బాధ్యతను చంద్రానే చూస్తున్నాడటే. ఈ మూడుచోట్ల పేకాట శిబిరాలను పర్యవేక్షిస్తున్న చిన్నారావు, రామినాయుడు గతంలో హిరమండలం పోలీసులకు ఒకసారి, టాస్క్‌ఫోర్స్‌కు మరోసారి చిక్కారు. వీరితో చంద్ర జత కట్టడంతో ఒడిశా బాటపట్టారు.

రోజూ మెళియాపుట్టి మీదుగా పర్లాకిమిడి నుంచి ఒడిశాలోని కాశీనగర్, రాణిపేట, గురండిలకు వెళ్లి పర్యవేక్షిస్తున్న సమయంలోనే మెళియాపుట్టి పోలీసులు చంద్ర వాహనాన్ని అడ్డగించి విచారించి ఒడిశాలో నిర్వహిస్తున్న పేకాట శిబిరాల వివరాలను సేకరించారు. గతంలో పేకాట ఆడుతున్న, శిబిరాలు నిర్వహిస్తున్న వారిని పోలీస్‌స్టేషన్లకు పిలిపించి బైండోవర్ చేసి విడిచిపెట్టారు. అందులో చంద్ర ఉన్నాడు. నరసన్నపేట సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు పలుమార్లు చంద్రను అధికారులు పిలిపించి హెచ్చరించారు. అయినా చంద్ర పట్టించుకోలేదు. శ్రీకాకుళం పరిధిలో ఉన్న పేకాట శిబిరాలు నిర్వాహకులను ఎస్పీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత ఈ బ్యాచ్ అంతా వారి సొంత పనుల్లో నిమగ్నమైపోయారు. ఇది జరిగిన తర్వాత నరసన్నపేట పరిధిలో ఉన్న చంద్ర మాత్రం పేకాట శిబిరాలు నిర్వహించే పనిలో బిజీగా మారిపోయాడు. పోలీసులతో మాట్లాడిన తర్వాతనే ఒడిశాలో పేకాట శిబిరాలు నిర్వహించి, మనుషులను తీసుకువెళుతున్నట్టు చంద్ర బహిరంగంగా చెబుతున్నాడట. ఒడిశాలోని గారబందలో పేకాట శిబిరాలపై పలాస సర్కిల్ పోలీసులు దాడి చేసి నిర్వాహకులను పట్టుకొనే ప్రయత్నం కొన్ని రోజులు క్రితం చేశారు. ఆ సందర్భంలో స్థానికులు ఎదురు తిరగడంతో పలాస పోలీసులు వెనక్కి వచ్చేశారు. అందులో చంద్ర ప్రధాన సూత్రధారి అని ప్రచారం ఉంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.